అన్నదాత నష్టాలపాలు

- కలసిరాని కళింగర, దోస సాగు
- నామమాత్రంగా దిగుబడి
- పాతాళానికి పడిపోయిన ధరలు
- పెట్టుబడులు తిరిగి రావంటున్న రైతులు


మార్కెట్‌కు తరలించేందుకు సిద్ధంగా ఉన్న దోసకాయలు


కళింగర కాయలను తొలగిస్తున్న కూలీలు

చెన్నేకొత్తపల్లి: మండలంలో కళింగర, దోస సాగు చేసిన రైతులకు కాలం కలిసిరాలేదు. పంట దిగుబడి లేక ధరలు కూడా పతనం కావడంతో నష్టాలపాల వుతున్నారు. గతంలో ధరలు ఆశాజనకంగా ఉండటంతో ఎక్కువ మంది రైతులు కళింగర, దోస సాగుకు ఆసక్తి చూపారు. వాణిజ్య పంటలు సాగు చేస్తే తక్కువ కాలవ్యవధిలో పంట చేతికొస్తుంది. ఆదాయం కూడా ఆర్జించవచ్చనే ఉద్దేశంతో అప్పులు తెచ్చి మరి పంటలు సాగు చేశారు. చెన్నేకొత్తపల్లి మండల వ్యాప్తంగా దాదాపు 200 ఎకరాల్లో దోస, దాదాపు 250 ఎకరాల్లో కళింగర సాగుకు శ్రీకారం చుట్టారు. ఈ పంటలను ఎకరా విస్తీర్ణంలో సాగు చేసేందుకు సుమారు రూ.70 వేల నుంచి 80 వేల వరకు పెట్టుబడి పెట్టారు. విత్తనాలు విత్తడం నుంచి ఎరువులు చల్లి పంటను జాగ్రత్తగా చూసుకున్నారు. చీడపీడలు సోకకుండా రసాయన మందులు పిచికారీ చేశారు. పంటను కంటికి రెప్పలా కాపాడు కున్నారు. అయితే దోస, కళింగర దిగుబడి ఆశించిన స్థాయిలో రాలేదు. గతంలో కంటే ధరలు ప్రస్తుతం భారీగా పడిపోయాయి. ఢిల్లీ రకం దోస కిలో రూ.3 పలుకుతోంది. కళింగర కిలో రూ.7 పలుకుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ధరలు ఉంటే పెట్టిన పెట్టుబడి కూడా చేతికి రాదని చెబుతున్నారు. ఎరువులను వాడటం వలన ఎకరా విస్తీర్ణంలో సుమారు పది టన్నుల వరకు వచ్చేది. వాతావరణం అనుకూలంగా లేకపోవడంతో ఐదు టన్నుల వరకు మాత్రమే దిగుబడి వస్తోందని రైతులు తెలిపారు.

పంట కాలం 60 రోజులు

దోస, కళింగర సాగు చేసిన తరువాత అరవై రోజులకు పంట కోతకు వస్తుంది. కోతల తరువాత వ్యాపారులు కాయలను మార్కెట్‌కు తరలించేందుకు కనీసం 3 నుంచి 4 రోజులు పడుతుంది. ఇక ఢిల్లీ రకం దోసకాయలను మార్కెట్‌కు తరలించడానికి వారం రోజులకు పైగా సమయం పడుతుంది. ఇందుకోసం వ్యాపారులు పది రోజులు ముందుగానే కోతలు ప్రారంభిస్తారు. దోస, కళింగరను నాగపూర్, కలకత్తా, శ్రీనగర్‌తో పాటు దుబాయ్, నేపాల్ దేశాలకు తరలిస్తారని రైతులు చెబుతున్నారు.

కన్నీరే మిగిలింది..



దోస, కళింగరకు గతంలో ధరలు ఆశాజనకంగా ఉండటంతో మంచి లాభం వస్తుందని 10 ఎకరాల్లో కళింగర సాగు చేశాను. ఇందుకోసం రూ.10 లక్షల వరకూ ఖర్చు పెట్టుకున్నారు. అయితే ఆశించిన పంట దిగుబడి రాలేదు. కళింగర ప్రస్తుతం కిలో రూ.7 పలుకుతోంది. ఆ లెక్కన చూస్తే పంటల సాగుకు చేసిన పెట్టుబడులు రాలేదు. ఆర్థికంగా నష్ట పోతున్నాం.

– నారాయణ స్వామి, రైతు, చెన్నేకొత్తపల్లి

పెట్టుబడి కూడా రాలేదు..



నాకున్న ఐదు ఎకరాల్లో ఢిల్లీ రకం దోస సాగు చేశాను. విత్తనాలు, పురుగుమందు, కూలీల ఖర్చులు తదితర పనుల కోసం రూ.3,50,000 వరకూ ఖర్చు చేయడం జరిగింది. సాధరణంగా ఎకరాకు పది టన్నుల వరకూ దిగుబడి వస్తుందని ఆశించాను. అయితే వాతావరణం అనుకూలించక పోవడంతో దాదాపు ఐదు టన్నుల వరకూ దిగుబడి వచ్చింది. ధర కిలో రూ.3 పలకడంతో పెట్టిన పెట్టుబడి కూడా రాలేదు.

– రాంగోపాల్ రెడ్డి, రైతు, వెంకటంపల్లి

నెక్స్‌వేవ్‌తో విద్యార్థులకు ప్రయోజనం


ఎంఓయూ కుదుర్చుకున్న బెస్ట్, బిట్స్ ప్రతినిధులు

పుట్టపర్తి అర్బన్: బిర్లా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ (బిట్స్) రూపొందించిన నెక్స్‌వేవ్‌తో విద్యార్థులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని బెస్ట్ ఇన్నోవేషన్ యూనివర్సిటీ ప్రో వైస్ చాన్స్‌లర్ డాక్టర్ అనురాధ అన్నారు. బుధవారం గోరంట్ల సమీపంలోని బెస్ట్ ఇన్నోవేషన్ యూనివర్సిటీలో బిట్స్ యూనివర్సిటీ స్థాపించిన వినూత్న స్టార్టప్ నెక్స్‌వేవ్ సహకారాన్ని అందిస్తామని బిట్స్ ప్రతినిధులు డాక్టర్ ఆకాష్, డాక్టర్ కార్తీక్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు బెస్ట్‌తో ఎంఓయూ కుదుర్చుకున్నారు. ఈ నెక్స్‌వేవ్‌తో శాస్త్ర సాంకేతిక రంగాలలో ఎన్నో ప్రయోజనాలు చేకూరుతాయన్నారు. ఈ ఆవిష్కరణతో పర్యావరణ వ్యవస్థ మెరుగుపడడంతో పాటు ఆత్యాధునిక వనరులు సమకూరుతాయని, ప్రపంచ వ్యాప్తంగా ఉన్న పరిశ్రమలతో సత్సంబంధాలు ఏర్పడుతాయన్నారు.

రోటరీ క్లబ్ కదిరి అధ్యక్షుడిగా తాయి నితిన్


రోటరీక్లబ్ నూతన కార్యవర్గ సభ్యులను సన్మానిస్తున్న దృశ్యం

కదిరి టౌన్: రోటరీ క్లబ్ కదిరి నూతన కార్యవర్గాన్ని ఇన్‌స్టలేషన్ ఆఫీసర్ కేశవరెడ్డి ఆధ్వర్యంలో బుధవారం ఎన్నుకున్నారు. బైరెడ్డి ఫంక్షన్‌హాలులో జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సీఐ జి.వెంకటేశ్వర్లు, ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి సీనియర్ వైద్యులు డాక్టర్ హుస్సేన్, రోటరీ క్లబ్ సభ్యులు మేడా ప్రభాకర్ పాల్గొన్నారు. 2024–25 సంవత్సరం నూతన అధ్యక్షుడిగా తాయి నితిన్, సెక్రటరీగా నామా నాగార్జున, ట్రెజరీగా నేతి అభినయ్ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో పచ్చిపులుసు రాఘవేంద్ర, శ్రీనివాస్, ప్రశాంత్, డాక్టర్ మదన్‌కుమార్, శివశంకర్, వాల్మీకి అనిల్‌కుమార్‌రెడ్డి, డాక్టర్ బాబాఫక్రుద్దీన్, కిషోర్‌కుమార్‌రెడ్డి, హర్ష వర్ధన్, రంజిత్, పృథ్వీరాజ్, నామా రాఘవేంద్ర, మట్టా రాజీవ్, మహేశ్వర్‌రెడ్డి, తాయి శ్రీనివాస్, తెహర్‌వలి, శ్రీనివాస్, కిరణ్, ప్రభాకర్, విజయానంద్, ప్రసాద్, బ్రహ్మచారి, డాక్టర్ ఇస్మాయిల్, అజాద్, సోమశేఖర్, అభిలాష్ పాల్గొన్నారు.

నిందితులను వెంటనే అరెస్టు చేయాలి


ఓడీచెరువులో తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న ఓబులు, అంగన్‌వాడీలు

ఓడీచెరువు/నల్లచెరువు/ ముదిగుబ్బ : వీరప్పగారిపల్లి అంగన్‌వాడీ కార్యకర్త నాగవేణి ఆత్మహత్యయత్నానికి కారకులైన ఆంజనేయులు, వెంకటేశ్వర్లును వెంటనే అరెస్టు చేయాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఓబులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఓడీచెరువు తహసీల్దారు కార్యాలయంలో సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీలు నిరసన చేపట్టి, తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు మాట్లాడుతూ ఆత్మహత్యాయత్నం చేసిన నాగవేణిని అదే రోజు ఆస్పత్రికి తీసుకెళ్లేందుకు సహకరించిన మరో అంగన్‌వాడీ కార్యకర్త సుహాసినిపైనా దాడి చేశారని ఆరోపించారు. తక్షణమే పోలీసులు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

- అంగన్‌వాడీ కార్యకర్త నాగవేణి ఆత్మహత్యాయత్నానికి కారకులైన టీడీపీ నేత ఆంజనేయులు తదితరులపై చర్యలు తీసుకోవాలని నల్లచెరువు మండల అంగన్‌వాడీలు సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం తహసీల్దార్ రవికుమార్‌కు వినతిపత్రం అందజేశారు.
- రాజకీయ వేధింపులకు పాల్పడిన ఆంజనేయులును వెంటనే అరెస్ట్ చేయాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలు ముదిగుబ్బ తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. అనంతరం వినతిపత్రాన్ని కార్యాలయ సిబ్బందికి అందజేశారు.

రాజకీయ వేధింపులు ఆపాలి

ధర్మవరం అర్బన్: అంగన్‌వాడీ వర్కర్లపై రాజకీయ వేధింపులు ఆపాలని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ యూనియన్ నాయకులు బుధవారం ఆర్డీఓ కార్యాలయంలోని ఏఓ లక్ష్మీదేవి, సీడీపీఓ కార్యాలయంలో సీడీపీఓ లక్ష్మికి వినతిపత్రాలు అందజేశారు. సీఐటీయూ కోకన్వీనర్ అయూబ్‌ఖాన్, ఆదినారాయణ, సీనియర్ నాయకులు ఎస్‌హెచ్ బాషా మాట్లాడుతూ జిల్లాలో ఉన్న అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలను అనేక ప్రాంతాల్లో రాజకీయ నాయకులు వేధింపులతోపాటు తొలగింపులకు గురిచేస్తూ వేధించడం సరికాదన్నారు.

కఠినంగా శిక్షించాలి

చెన్నేకొత్తపల్లి: ఓడీసీ ప్రాజెక్టు పరిధిలోని వీరప్పగారిపల్లిలో అంగన్‌వాడీ వర్కర్‌గా పని చేస్తున్న నాగవేణి ఆత్మహత్యాయత్నానికి కారకులైన వారిని వెంటనే అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని పలువురు అంగన్‌వాడీ వర్కర్లు డిమాండ్ చేశారు. బుధవారం సీఐటీయూ నాయకుడు లింగన్నతో కలసి చెన్నేకొత్తపల్లి ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విజయలక్ష్మికి వినతిపత్రం అందజేశారు.

వేధింపులు ఆపండి

కనగానపల్లి: టీడీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత పలు గ్రామాల్లో అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలపై జరుగుతున్న రాజకీయ వేధింపులు ఆపాలని అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ సభ్యులు అధికారులను కోరారు. బుధవారం యూనియన్ సభ్యులు లక్ష్మీదేవి, అంబుజా, రమాదేవి, వనిత తదితరులు తహసీల్దార్ రమాదేవికి వినతిపత్రం అందజేశారు.

ఆర్‌ఎంపీలు వైద్య పరీక్షలు నిర్వహించరాదు


మలమీదపల్లిలోని ప్రథమ చికిత్స కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న వైద్యాధికారి మహేశ్వరమారుతి

గాండ్లపెంట: ఆర్‌ఎంపీలు ప్రథమ చికిత్సా కేంద్రాల్లో ఎలాంటి వైద్యం కానీ, వైద్య పరీక్షలు కానీ నిర్వహించరాదని పీహెచ్‌సీ వైద్యాధికారి మహేశ్వర మారుతి తెలిపారు. జిల్లా వైద్య ఆరోగ్య అధికారి, డిప్యూటీ ఆరోగ్య అధికారి ఆదేశాల మేరకు బుధవారం మండల కేంద్రంలోని ప్రథమ చికిత్స కేంద్రాలతో పాటు మలమీదపల్లిలోని ప్రథమ చికిత్స కేంద్రాలను ఆయన తనిఖీ చేశారు. నిర్వహకులతో వైద్యాధికారి మాట్లాడుతూ కేంద్రాల్లో ఎలాంటి వైద్యానికి సంబంధించిన బోర్డులు, పేరుకు ముందు డాక్టర్ అని పెట్టుకోరాదన్నారు. ఎవరైనా అత్యవసర అనారోగ్యంతో వస్తే వారికి ప్రభుత్వాసుపత్రికి వెళ్లాలని సిఫార్సు చేయాలన్నారు. అధికంగా యాంటీబయోటిక్స్ వాడరాదని, ప్రథమ చికిత్సా కేంద్రాల్లో ల్యాబ్ పరీక్షలుకానీ, ఫ్లూయిడ్స్ ఇవ్వడం కానీ, కాన్పులు చేయడం కానీ జరిగితే చర్యలు కఠినంగా ఉంటాయన్నారు. కార్యక్రమంలో సీనియర్ సహాయకులు ఫైరోజ్, హెల్త్ ఎడ్యుకేటర్ విజయ్‌కుమార్, ఎంఎల్‌హెచ్‌పీలు, హెచ్‌ఏలు, ఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉపాధి పనులు సద్వినియోగం చేసుకోండి

ధర్మవరం రూరల్: ఉపాధి హామీ పథకం పనులను కూలీలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా అంబుడ్స్‌మెన్ అధికారి శివారెడ్డి, ఏపీఓ అనిల్‌కుమార్‌రెడ్డి సూచించారు. బుధవారం నిమ్మలకుంట వద్ద చింత తోపులో ఉపాధి హామీ పథకం కింద జరుగుతున్న నీటి కందకాల పనులను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా కూలీలతో మాట్లాడుతూ ఏడాదిలో వంద రోజుల పనిదినాలను కచ్చితంగా పూర్తి చేసుకోవాలన్నారు. దినసరి కూలి రూ.300 పడే విధంగా పని చేయాలన్నారు. గతంలో చేసిన పనులకు నేటికి బిల్లులు చెల్లించలేదని పలువురు కూలీలు అంబుడ్స్‌మెన్ అధికారి దృష్టికి తీసుకొచ్చారు. ఇందుకు ఆయన స్పందిస్తూ త్వరలోనే బిల్లులు జమ అవుతాయన్నారు.

ప్రకృతి వ్యవసాయం లాభదాయకం

చెన్నేకొత్తపల్లి: ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన ధాన్యాలు, పండ్లు, కాయగూరలను తింటే ఆరోగ్యంగా ఉండవచ్చని వ్యవసాయాధికారులు రైతులకు సూచించారు. మండల పరిధిలోని మేడాపురం గ్రామంలో బుధవారం ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించారు. గ్రామానికి చెందిన రైతు రాము, లక్ష్మీకాంతమ్మ పొలంలో ప్రకృతి వ్యవసాయం ద్వారా సాగు చేసిన పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఘన జీవామృతం తయారీ విధానాన్ని వివరించారు. ప్రకృతి వ్యవసాయంతో పెట్టుబడులు తగ్గడంతో పాటు అధిక దిగుబడులు వస్తాయన్నారు. రైతులు ప్రకృతి వ్యవసాయం పట్ల అవగాహన పెంచుకొని సాగు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఆత్మ బీటీఎం ప్రతిభ, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఉద్యోగికి ఘన సన్మానం


వెంకటరమణను సన్మానిస్తున్న యునాని వైద్యుడు ఖాదర్, సిబ్బంది

ధర్మవరం అర్బన్: పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రి యునాని వైద్యశాలలో బుధవారం ఉద్యోగ విరమణ చేసిన కాంపౌండర్ వెంకటరమణను యునాని వైద్యుడు ఖాదర్ ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఆర్‌టీఐ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు, ఉపాధ్యక్షులు గోపీ, ధర్మవరం గౌరవాధ్యక్షుడు ఆదినారాయణ, అధ్యక్షుడు కొండప్ప తదితరులు కూడా సన్మానించారు.

మఠం భూముల్లో పేదలకు పట్టాలివ్వాలి


ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు

ధర్మవరం: నిడిమామిడి మఠం భూమిలో పేదలకు ఇంటి పట్టాలివ్వాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ముసుగు మధు, చలపతి డిమాండ్ చేశారు. ఆర్డీఓ కార్యాలయం వద్ద బుధవారం సీపీఐ నాయకులు పేదలతో కలిసి ధర్నా చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ నిడిమామిడి మఠం భూమి సర్వే నంబర్ 401లో పేదలకు ఇంటి పట్టాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆర్డీఓ వెంకట శివరామిరెడ్డికి వినతిపత్రం అందించారు. నాయకులు రవికుమార్, రమణ, వెంకట్, వెంకటస్వామి, రమణ, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

జీసీఆర్ పాఠశాలకు షోకాజ్


షోకాజ్ నోటీస్ అందిస్తున్న ఎంఈఓ కృష్ణానాయక్

గాండ్లపెంట: మండల కేంద్రంలోని జీసీఆర్ (గజ్జల చెన్నారెడ్డి) ఇంగ్లిష్ మీడియం స్కూల్ నిర్వాహకులకు బుధవారం ఎంఈఓ కృష్ణానాయక్ షోకాజ్ నోటీస్ జారీ చేశారు. అనుమతి లేకపోయినా ఎనిమిదో తరగతి నిర్వహిస్తున్నందుకు ఈ నోటీస్ జారీ చేసినట్లు ఎంఈఓ తెలిపారు. అనుమతి లేని తరగతులు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రోగులకు మెరుగైన వైద్యం అందించాలి


డయాలసిస్ మిషన్లను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కందికుంట ప్రసాద్

కదిరి టౌన్: కదిరి ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు మెరుగైన వైద్యం అందించాలని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ ఆదేశించారు. బుధవారం ఆస్పత్రిని ఆయన పరిశీలించారు. అనంతరం ఆస్పత్రికి నూతనంగా వచ్చిన 4 డయాలసిస్ మిషన్లను, ఏఆర్‌టీ సెంటర్‌లో సీడీ 4 కౌంటింగ్ మిషన్లను ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ హుస్సేన్, డీఎంహెచ్ఓ డాక్టర్ తిపేంద్ర నాయక్, వైద్యులు, టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి పవన్‌కుమార్‌రెడ్డి, పట్టణ అధ్యక్షులు డైమండ్ ఇర్ఫాన్, నాయకురాలు పర్వీన్‌బాను, బీజేపీ నాయకులు కేశవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేపు, ఎల్లుండి తాగునీటి సరఫరా నిలిపివేత

ధర్మవరం అర్బన్: ధర్మవరం మున్సిపాలిటీలో శుక్ర, శనివారాల్లో తాగునీటి సరఫరా నిలిపివేయనున్నారు. పార్నపల్లి వాటర్ వర్క్స్ దగ్గర మెయింటెనెన్స్ వర్క్ జరుగుతున్నందున రెండురోజులు నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని కమిషనర్ రామ్‌కుమార్ తెలిపారు. ప్రజలు గమనించి నీటిని పొదుపుగా వాడుకోవాలని సూచించారు.

సబ్ జైలు తనిఖీ


సబ్ జైలులో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి

కదిరి టౌన్: పట్టణంలోని సబ్ జైలును సీనియర్ సివిల్ జడ్జి ఎస్.విజయలక్ష్మి బుధవారం తనిఖీ చేశారు. ఖైదీలకు భోజనం సక్రమంగా అందిస్తున్నారా లేదా అడిగి తెలుసుకున్నారు. ఖైదీలకు అందుతున్న సమాచారం, ఉచిత న్యాయ సేవలు, వైద్య సదుపాయాలపై ఆరా తీశారు. కార్యక్రమంలో న్యాయవాదులు లింగాల లోకేశ్వర్‌రెడ్డి, నరసింహులు, సబ్ జైలు సూపరింటెండెంట్ వాసుదేవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పగిలిన సత్యసాయి పైపులైన్


లీకేజీతో వృథాగా పోతున్న సత్యసాయి నీరు

ముదిగుబ్బ: పార్నపల్లి నుంచి కదిరికి సరఫరా అయ్యే సత్యసాయి తాగునీటి పథకం పైపులైన్ దొరిగిల్లు వద్ద పగిలిపోయింది. గుట్ట ప్రాంతంలో పగిలి రెండు నెలలుగా నీరు వృథాగా పోతోంది. ఇక్కడ నూతనంగా సబ్‌స్టేషన్ ఏర్పాటు చేస్తున్నారు. ఇక్కడ పనులు జరుగుతున్న సమయంలో పైపులైన్ దెబ్బతిందని గ్రామస్తులు చెబుతున్నారు. అయినా అధికారులు పట్టనట్టు ఉంటున్నారన్నారు.

తనిఖీలు పారదర్శకంగా ఉండాలి

బత్తలపల్లి: ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీని పారదర్శకంగా చేపట్టాలని ఎంపీడీఓ శివనాగప్రసాద్ పేర్కొన్నారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఏపీఓ ఆదెప్ప అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలో 2023–24వ ఆర్థిక సంవత్సరంలో జరిగిన ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీలు చేపడతామన్నారు. ఈ నెల ఒకటో తేదీ నుంచి 8వ తేదీ వరకు అన్ని గ్రామాల్లో పింఛన్లు, ఉపాధి పనులు తనిఖీ చేసి, 9న ప్రజావేదిక నిర్వహించనున్నట్లు చెప్పారు.

రిటైర్మెంట్ సర్వసాధారణం

పుట్టపర్తి టౌన్: ప్రతి ఉద్యోగికీ రిటైర్మెంట్ అనేది సర్వ సాధారణమని వక్తలు పేర్కొన్నారు. ఉద్యోగులు నిబద్ధతతో పనిచేసి ప్రజల మన్ననలు పొందాలన్నారు. పుట్టపర్తి గ్రంథాలయ శాఖాధికారి అంజనేయులు బుధవారం ఉద్యోగ విరమణ పొందారు. గ్రంథాలయ కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేసి ఆయనకు తోటి ఉద్యోగులు, సిబ్బంది శాలువాలు, పూలమాలలతో సన్మానించారు. అనంతరం గ్రంథాలయ నూతన అధికారిగా జయసింహరాజు బాధ్యతలు తీసుకున్నారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ చెన్నకేశవులు, మల్లికార్జున, రమేష్, రామ్‌ప్రసాద్, పాఠకులు పాల్గొన్నారు.

రామచంద్రారెడ్డి పాత్ర కీలకం


రామచంద్రారెడ్డిని సన్మానిస్తున్న దృశ్యం

పుట్టపర్తి అర్బన్: పెడపల్లి ఉన్నత పాఠశాల అభివృద్ధితో పాటు విద్యార్థులకు క్రమశిక్షణ, విద్యాభివృద్ధిలో హెచ్‌ఎం రామచంద్రారెడ్డి కీలకపాత్ర పోషించారని వక్తలు పేర్కొన్నారు. బుధవారం హెచ్‌ఎం ఉద్యోగ విరమణ సందర్భంగా పాఠశాలలో వీడ్కోలు సభ ఏర్పాటు చేశారు. మాజీ ఎమ్మెల్యే పల్లె రఘునాథరెడ్డి, డీవైఈఓ రంగస్వామి, ఎంపీపీ ఏవీ రమణారెడ్డి, వైఎస్సార్‌టీఎఫ్ నాయకులు రమణారెడ్డి, పూర్వ హెచ్‌ఎంలు సుబ్రహ్మణ్యం, అక్తర్‌బాషా, నారాయణరెడ్డి తదితరులు హెచ్‌ఎం రామచంద్రారెడ్డి సేవలను కొనియాడారు. అనంతరం రామచంద్రారెడ్డి దంపతులను ఘనంగా సత్కరించారు. పూర్వ హెచ్‌ఎంలతో కలిసి గ్రామంలో ఊరేగించారు.

ఆర్టీసీ డ్రైవర్‌కు సన్మానం

పుట్టపర్తి టౌన్: పుట్టపర్తి ఆర్టీసీ డిపో డ్రైవర్ కేవీఎస్ శేఖర్ ఉద్యోగ విరమణ చేశారు. బుధవారం ఎన్‌ఎంయూ జోనల్ జాయింట్ సెక్రటరీ అధ్యక్షతన డిపోలో ఉద్యోగ, కార్మిక సిబ్బంది ఆత్మీయ సమావేశంలో శేఖర్‌ను ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు.

బీపీఎం సేవలు ఎనలేనివి

తనకల్లు: గుర్రంబైలు బీపీఎం (బ్రాంచ్ పోస్ట్ మాస్టర్) శివశంకర్‌రెడ్డి సేవలు ఎనలేనివని వక్తలు పేర్కొన్నారు. బీపీఎం బుధవారం ఉద్యోగవిరమణ చేశారు. ఈ సందర్భంగా ఆయనకు కొక్కంటిక్రాస్‌లోని పోలం సిద్దారెడ్డి ఫంక్షన్‌హాల్‌లో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో తపాలా ఉద్యోగులు, నాయకులు పాల్గొన్నారు.

పుస్తకాల పంపిణీ

కదిరి అర్బన్: పట్టణంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో విద్యార్థులకు బుధవారం ఉచిత బ్యాగులు, నోటుపుస్తకాలు పంపిణీ చేశారు. ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్, వాల్మీకి విద్యాసంస్థల అధినేత పవన్‌కుమార్‌రెడ్డి హాజరయ్యారు.

కిట్ల పంపిణీ

తలుపుల : గుండువారిపల్లి పీవీఆర్ జిల్లాపరిషత్ హైస్కూల్‌లో విద్యార్థులకు బుధవారం కిట్లు, పాఠ్యపుస్తకాలను ఎమ్మెల్యే కందికుంట ప్రసాద్ బుధవారం అందజేశారు.

మినీ గోకులాలకు దరఖాస్తు చేసుకోండి

కదిరి అర్బన్: మండలంలో మినీ గోకులాల మంజూరుకు రైతులు దరఖాస్తు చేసుకోవాలని వెటర్నరీ డాక్టర్ సునీత కోరారు. సచివాలయలోని ఏహెచ్ఏ వద్ద దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

నల్లచెరువు: మినీ గోకులం షెడ్ల ఏర్పాటుకు రైతుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పశు వైద్యాధికారి మల్లికార్జున తెలిపారు. అలాగే గొర్రెలు, మేకలు, కోళ్ల షెడ్లకు 70శాతం సబ్సిడీతో షెడ్లను ప్రభుత్వం మంజూరు చేస్తున్నట్లు వెల్లడించారు. మరిన్ని వివరాలకు సచివాలయాల్లో ఏహెచ్ఏలను సంప్రదించాలన్నారు.

టీకాలతో సంపూర్ణ ఆరోగ్యం

తాడిమర్రి: వ్యాధి నిరోధక టీకాలతో చిన్నారులకు సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని సీహెచ్ఓ హేమలత పేర్కొన్నారు. తాడిమర్రి ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రంలో బుధవారం ఏఎన్‌ఎం కోమలి చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలు వేశారు. ముఖ్య అతిథిగా సీహెచ్ఓ హాజరై మాట్లాడారు.

మూడు ఎకరాలు ఇవ్వాలి

కదిరి టౌన్: నిరుపేదలకు మూడు ఎకరాల చొప్పున వ్యవసాయ భూమి పంపిణీ చేయాలని కాంగ్రెస్ ఎస్సీ సెల్ నాయకులు కదిరప్ప డిమాండ్ చేశారు. బుధవారం ఆయన కదిరిలోని పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు.

సంక్షిప్త సమాచారం

గ్రంథాలయాధికారికి వీడ్కోలు


కృష్ణయ్య దంపతులను సత్కరిస్తున్న దృశ్యం

చెన్నేకొత్తపల్లి: మండల కేంద్రంలో గ్రంథాలయాధికారిగా పని చేస్తున్న కృష్ణయ్య బుధవారం ఉద్యోగ విరమణ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో కృష్ణయ్య దంపతులను పూలమాలలతో సన్మానించారు. కార్యక్రమంలో రిటైర్డ్ డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసరెడ్డి, రిటైర్డ్ హెచ్‌ఎం రంగారెడ్డి, జిల్లా గ్రంథాలయ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రతాప్‌రెడ్డి, సంఘం అసోసియేట్ అధ్యక్షుడు రవికుమార్ నాయుడు, గ్రంథాలయాధికారులు గ్రామస్తులు పాల్గొన్నారు.

మహిళలు అభివృద్ధి చెందాలి

చెన్నేకొత్తపల్లి: మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని టింబక్టు కలెక్టివ్ సొసైటీ వ్యవస్థాపకురాలు మేరీ వటమట్టం సూచించారు. బుధవారం టింబక్టు కలెక్టివ్ సొసైటీ సీఈఓ రమీజా, సొసైటీ అధ్యక్షురాలు సుజాత అధ్యక్షతన 12వ వార్షిక మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా మేరీ వటమట్టం మాట్లాడుతూ.. 9 మండలాల్లోని 333 గ్రామాల్లో 1,442 సంఘాలతో సొసైటీ కార్యకలాపాలు నిర్వహిస్తున్నామన్నారు. మహిళలు ఆర్థికంగా ఎదగడంతో పాటు పిల్లలను ఉన్నత చదువులు చదివించాలని సూచించారు. అనంతరం సొసైటీ వార్షిక నివేదికలను సభ్యులకు చదివి వినిపించారు. కొన్నేళ్లుగా సొసైటీ అభివృద్ధికి సహాయ సహకారాలు అందించిన వారిని సన్మానించారు. కార్యక్రమంలో సుకన్య, గౌరి, రవళి, పావని తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి ఆర్థికసాయం

బత్తలపల్లి: రజక సంఘం ఆధ్వర్యంలో బత్తలపల్లిలో చేపట్టిన గంగమ్మ దేవాలయ నిర్మాణానికి వైఎస్సార్‌సీపీ యువ నాయకుడు పామల్ల రమేష్ ఆర్థిక సాయం చేశారు. బుధవారం బత్తలపల్లిలోని తన స్వగృహంలో రూ.10,500 నగదును రజక సంఘం నాయకులు నారాయణస్వామి, నగేష్, శ్రీనా, సత్యప్ప, తిరుపాలు, మంజు తదితరులకు అందజేశారు. విగ్రహ ప్రతిష్ఠకు అవసరమైన ఏర్పాట్లకు సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు.

ఈదులముష్టూరు సర్పంచ్‌గా చిన్నముసలప్ప

బత్తలపల్లి: ఈదులముష్టూరు సర్పంచ్‌గా చిన్న ముసలప్ప బాధ్యతలు స్వీకరించారు. ఇదివరకు సర్పంచ్‌గా ఉన్న చెడిపోతుల గోపాల్ తన పదవికి రాజీనామా చేశారు. దీంతో ఉపసర్పంచ్‌గా కొనసాగుతున్న చిన్న ముసలప్పకు సర్పంచ్ బాధ్యతలు అప్పగించారు. బుధవారం గ్రామ సచివాలయంలో ఎంపీడీఓ శివనాగప్రసాద్, ఈఓఆర్డీ దివాకర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో సర్పంచ్ బాధ్యతలు స్వీకరించారు.

8న ఎస్ఎంసీ ఎన్నికలు

కనగానపల్లి: మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఆగస్టు 8వ తేదీన పాఠశాల నిర్వహణ కమిటీల (ఎస్ఎంసీ) ఎన్నికలు జరగనున్నట్లు ఎంఈఓ అరుణమ్మ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో పాఠశాలలో ఉన్న పేరెంట్స్ కమిటీల పాలన సమయం గడువు ముగిసినట్లు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ఎస్ఎంసీ కమిటీలను ఏర్పాటుకు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఎస్ఎంసీల ఎన్నికలకు గురువారం నోటిఫికేషన్ విడుదల కానుందన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి కలసి పనిచేద్దాం

పుట్టపర్తి: ఎన్నికల ప్రక్రియ ముగిసినందున ఇక నుంచి అందరూ కలసి పుట్టపర్తి నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేద్దామని ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి అన్నారు. ఆమె బుధవారం ఎంపీపీ శ్రీధర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన బుక్కపట్నం మండల సర్వసభ్య సమావేశంలో ముఖ్య అతిథిగా మాట్లాడారు. మండల అభివృద్ధికి ఎమ్మెల్యే ఏ నిర్ణయం తీసుకున్నా తాము సహకరిస్తామని ఎంపీపీ శ్రీధర్‌రెడ్డి, జెడ్పీటీసీ శ్రీలతారెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాసులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు. కార్యక్రమం అనంతరం ఎమ్మెల్యే బుక్కపట్నం తేరు కూడలిలో ఉన్న ప్రాథమిక పాఠశాలను సందర్శించి అక్కడి విద్యార్థులతో ముచ్చటించారు. అలాగే అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు.